క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలో నియామకాలు


శ్రీధర్ ప్రకాష్ జయపాల్

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీలో వివిధ పదవులకు నియామకాలను ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ప్రకటించింది. చిత్తూరు నగర పార్టీ అధ్యక్షుడిగా కేపీ శ్రీధర్, గుడిపాల మండల అధ్యక్షుడిగా జె.ప్రకాష్, చిత్తూరు రూరల్ మండల అధ్యక్షుడిగా డీఎం.జయపాల్‌ను నియమించారు. కాగా కేపీ శ్రీధర్ 2005లో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా, అప్పట్లో 28 వార్డు కౌన్సిలర్‌గా పనిచేశారు. జె.ప్రకాష్ సర్పంచ్‌గా పనిచేశారు. పదవులకు సిఫార్సు చేసిన పార్టీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బాధ్యతతో పనిచేసి పార్టీ కార్యక్రమాలు చురుగ్గా నిర్వహించనున్నట్లు శ్రీధర్, ప్రకాష్, జయపాల్ తెలిపారు.

నియామకం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): శత జయంతి ఉత్సవాలో భాగంగా చిత్తూరు నగరం గిరింపేటలోని శ్రీసత్యసాయి సేవా సంస్థ కన్వీనర్‌గా ప్రభాకర్‌నాయుడును నియమించారు. బుధవారం ఆయన బాధ్యతలను స్వీకరించారు. అనంతరం శతజయంతి ఉత్సవాలపై సభ్యులతో చర్చించారు.

మామిడి కవర్లకు నమోదు చేసుకోవాలి

బంగారుపాళెం/ఐరాల : రైతులు మామిడి కవర్ల కోసం పేర్లు నమోదు చేసుకోవాలని మండల ఉద్యానశాఖ అధికారి సాగరిక బుధవారం ఓ ప్రకటనలో కోరారు. మామిడి కవర్లు అవసరమైన రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రంలో ఇన్‌చార్జిలను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని, ముందుగా రైతు వాటా చెల్లించి పేర్లు నమోదు చేసుకున్న వారికి కవర్లు తెప్పిస్తామన్నారు. కవరు ధర ఒక రూపాయని, ఇది కాకుండా అన్‌లోడింగ్‌కు అదనపు చార్జీలు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

పేయదూడల ప్రదర్శన


యాదమరి(కాణిపాకం): యాదమరి మండలం లక్ష్మయ్యకండ్రిగలో బుధవారం సంకరజాతి పేయదూడల ప్రదర్శన ఏర్పాటు చేశారు. పశుసంవర్ధకశాఖ అధికారి వాసు మాట్లాడారు. పేయదూడల ప్రదర్శన ఉద్దేశం, వాటి లాభాలను వివరించారు. నాణ్యమైన దూడలను ఎంపిక చేసి వాటి యజమానులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి సంధ్య, పాడి రైతులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్లు సీజ్


టిప్పర్లను సీజ్ చేసిన డీఎస్పీ, ఎస్‌ఐ

పాలసముద్రం: వనదుర్గాపురం నుంచి తమిళనాడుకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను బుధవారం ఉదయం నగరి డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్, ఎస్‌ఐ చిన్నరెడ్డప్ప సీజ్ చేశారు. టిప్పర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వనదుర్గాపురం నుంచి తమిళనాడుకి ఎలాంటి బిల్లులు లేకుండా టిప్పర్‌లో ఇసుక తరలిస్తున్నారన్న రహస్య సమాచారం అందడంతో డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్, ఎస్‌ఐ చిన్నరెడ్డప్ప నిఘా పెట్టారు. తెల్లవారుజామున 2 గంటలకు టిప్పర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కి తీసుకొచ్చారు.

ఐషర్ వాహనం బోల్తా



వెదురుకుప్పం: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న మలుపు వద్ద బుధవారం వరి బస్తాలతో వెళ్తున్న ఐషర్ లారీ బోల్తా పడింది. ఎవరికీ ఎలాంటి అపాయం జరగలేదు. వాహనంలో ఉన్న వరి బస్తాలు నేలపాలైనట్లు స్థానికులు తెలిపారు. డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెప్పారు. పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

సత్ప్రవర్తనతో మెలగాలి

కార్వేటినగరం: హత్యలు, దొంగతనాలు, మాదకద్రవ్యాల అమ్మకాలకు దూరంగా ఉంటూ సత్ప్రవర్తనతో మెలగాలని నగరి డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ అన్నారు. బుధవారం స్థానిక సీఐ కార్యాలయంలో కార్వేటినగరం సర్కిల్ పరిధిలోని రౌడీ షీటర్లకు నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నేరాలకు దూరంగా ఉంటూ మంచి ప్రవర్తన కలిగి ఉన్న వారిపై కేసులు మాఫీ చేసే అవకాశం ఉంటుందన్నారు. పలు రకాల కేసుల్లో రౌడీ షీటర్‌గా ఉంటున్నవారు వయసుమీరి, అనారోగ్యంతో బాధపడుతున్న వారు డాక్టర్ సర్టిఫికెట్‌తో పాటు వినతి పత్రాన్ని స్థానిక ఎస్‌ఐలు, సీఐకి అందించాలన్నారు. వారి ఆరోగ్యపరిస్థితిని పరిశీలించి కేసుల నుంచి తొలగించడానికి తమ వంతు ప్రయత్నిస్తామన్నారు. గంజాయి, సారా, మద్యంఅమ్మకాల వివరాలను పోలీసుల దృష్టికి తీసుకొచ్చి సహకరించాలని సూచించారు. పోలీస్ సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రత్యేక నిఘా ఉంచుతారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ హనుమంతప్ప, ఎస్‌ఐలు రాజ్‌కుమార్(కార్వేటినగరం), సుమన్(శ్రీరంగరాజపురం), వెంకటసుబ్బయ్య (వెదురుకుప్పం), పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణోత్సవం



మండలంలోని దేవరకొండపై ఉన్న శ్రీపార్వతి సమేత జలకంఠేశ్వర స్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం భక్త జన సందడి నడుమ కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా జలకంఠేశ్వరస్వామి, పార్వతమ్మకు ఉదయం ప్రత్యేక పూజార్చనలు, అభిషేకాలు పూజల అనంతరం స్వామి, అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయం ఆవరణలో శ్రీజలకంఠేశ్వరస్వామి కళ్యాణాన్ని భక్తుల సమక్షంలో వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పాణ్యం శ్రీనివాసశర్మ, కుమార్ తదితరులు పాల్గొన్నారు. – బంగారుపాళెం

వార్షికోత్సవం



హోమం చేస్తున్న వేద పండితుడు, విశేషాలంకారంలో ముత్యాలమ్మ

బంగారుపాళెం గ్రామదేవత ముత్యాలమ్మ ఆలయ 13వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు మురళి గురుకుల్ ఆధ్వర్యంలో అర్చకులు శ్రీమహాగణపతి పూజ, శుద్ధి, పుణ్యాహవచనం, గణపతి హోమం, సకల దేవతల హోమం, పూర్ణాహుతి, దీపారాధన, స్వామి, అమ్మవార్లకు కలశాభిషేకం, పంచామృతాభిషేకం తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం లలిత సహస్ర నామార్చన చేశారు. మహామంగళ హారతి ఇచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. – బంగారుపాళెం

సుదర్శన హోమం


అర్ధగిరిలో చేస్తున్న సుదర్శన హోమం

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో బుధవారం మాఘమాసం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు చేసి ధూప దీప నైవేద్యం సమర్పించారు. అనంతరం చందనాలంకరణలో స్వామివారు భక్తులను అనుగ్రహించారు. అలాగే, ఆలయ ఆవరణలో ఉభయదారులతో సుదర్శన హోమం నిర్వహించారు. పూర్ణాహుతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. రాత్రి ఉత్సవ మూర్తికి అభిషేక పూజల అనంతరం ప్రాకారోత్సవం నిర్వహించారు. భక్తుల కాలక్షేపానికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈఓ హనుమంతురావు పర్యవేక్షించారు. – తవణంపల్లె

పాత బస్టాండు వ్యాపారులకు అండగా ఉంటాం

–నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త విజయానందరెడ్డి


పాత బస్టాండు

చిత్తూరు అర్బన్: చిత్తూరు పాత బస్టాండ్ వ్యాపారులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ సమన్వయకర్త ఎంసీ విజయానంద రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం పాత బస్టాండ్ లోని వ్యాపారులు విజయానంద రెడ్డిని కలిసి తమ గోడు నివేదించారు. కార్పొరేషన్ అధికారులు బస్టాండ్‌ను ఖాళీ చేయించాలని చెబుతూ ఇక్కడ తమ దుకాణాలను సైతం ఖాళీ చేస్తామని బెదిరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రం ఉన్న సమయంలోనే మార్కెట్ విలువ ప్రకారం ప్రభుత్వం నుంచి బస్టాండులో దుకాణాలు కొనుగోలు చేసినట్లు తెలిపారు. అయితే అధికారులు అన్యాయంగా తమను ఖాళీ చేయించాలని చూస్తున్నారని...తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారని వాపోయారు. దీనిపై విజయానందరెడ్డి మాట్లాడుతూ, వ్యాపారులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. బస్టాండ్‌లో దుకాణాలు కొనుగోలు చేసిన ప్రతి వ్యాపారికీ తమ పార్టీ అండగా ఉంటుందని, ఇప్పటికే ఈ విషయాన్ని జిల్లా పార్టీ అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి దృష్టికి సైతం తీసుకెళ్లామన్నారు. త్వరలోనే ఆయన చిత్తూరు కార్పొరేషన్ అధికారులతో చర్చిస్తారని, అవసరమైతే వ్యాపారులకు మద్దతుగా బస్టాండ్ వద్ద ఆందోళన చేయడానికి సైతం సిద్ధంగా ఉన్నామన్నారు. వందలాదిమంది వ్యాపారులను రోడ్డున పడేస్తే వారి కుటుంబాల సైతం ఆకలితో అలమటిస్తాయని విషయాన్ని కార్పొరేషన్ అధికారులు గుర్తించుకోవాలని, బస్టాండ్ విషయాన్ని రాజకీయం చేయొద్దని సామరస్యంగా మసలుకోవాలని హితవు పలికారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు ముఖ్యం

–మండల ప్రత్యేకాధికారి బాలాజి


పీహెచ్‌సీలో రోగులను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి బాలాజి

తవణంపల్లె: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని తవణంపల్లె మండల ప్రత్యేక అధికారి, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి బాలాజి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల ప్రత్యేక అధికారి ఎంపీడీఓ రెడ్డిబాబుతో కలసి బుధవారం మండలంలోని పలు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, తవణంపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అరగొండ బాలుర హైస్కూల్, అరగొండ బాలికల హైస్కూల్లో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనాలు పెట్టాలని మధ్యాహ్న భోజనం నిర్వాహకులను ఆదేశించారు. తవణంపల్లె పీహెచ్‌సీలో రోగులకు ఎలాంటి వసతులు ఉన్నాయి? అన్ని రకాల మందులు ఉన్నాయా? అని ఆరా తీశారు. దిగువమాఘం, అరగొండ, టి.పుత్తూరు అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి పిల్లలకు, గర్భవతులకు, బాలింతలకు సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఐరాల సీడీపీఓ నిర్మల, పంచాయతీ కార్యదర్శులు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఏఆర్‌టి కేంద్రం తనిఖీ


ఏఆర్‌టి కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న శంకర్

బంగారుపాళెం: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలోని లింక్ ఏఆర్‌టి కేంద్రాన్ని బుధవారం డేటా మానిటరింగ్, డాక్యుమెంటేషన్ అధికారి(డిఎండిఓ) శంకర్ ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులను ఆయన పరిశీలించారు. సెంటర్‌లో హెచ్‌ఐవీ, ఎయిడ్స్ బాధితులకు అందుతున్న సేవలను కౌన్సిలర్ బాబును అడిగి తెలుసుకున్నారు. హెచ్‌ఐవీ నిర్ధారణ పరీక్షల నిమిత్తం రోజూ ఎంత మంది వస్తున్నారు? సేవలు ఏవిధంగా అందిస్తున్నారు? అనే అంశాలపై ఆరా తీశారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ బాధితులు మందుల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. లింక్ ఏఆర్‌టి కేంద్రంలోనే ఇస్తున్నారని, బాధితులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ శిరీష, ల్యాబ్ టెక్నీషియన్ జయచంద్ర, సిబ్బంది భువన, సద్దాం పాల్గొన్నారు.

రాయితీపై కరొండా మొక్కలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): సాంప్రదాయేతర పంటల సాగును ప్రోత్సహించడంలో భాగంగా ఉద్యానశాఖ కరొండా మొక్కలను రాయితీపై ఇస్తున్నట్టు ఆ శాఖ జేడీ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈ మొక్కలను కంచెపంటగా సాగు చేయడానికి హెక్టారుకు రూ. 30వేల రాయితీ ఇస్తున్నామన్నారు. మొదటి సంవత్సరానికి రూ.18వేలు, రెండవ సంవత్సరానికి రూ. 6వేలు, మూడవ సంవత్సరానికి రూ. 6వేల చొప్పున రాయితీ వస్తుందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకుని కంచె పంటగా వేసుకుంటే అదనపు ఆదాయం పొందవచ్చునన్నారు. రైతులు నేరుగా ప్రభుత్వ నర్సరీల్లో మొక్కలు తీసుకొచ్చి నాటుకోవచ్చన్నారు. అనంతరం ఉద్యానశాఖ అధికారులను సంప్రదించి దరఖాస్తు, మొక్కల బిల్లులు అందజేస్తే సబ్సిడీని విడతల వారీగా పొందవచ్చని ఆయన తెలియజేశారు.

త్వరితగతిన మరమ్మతులు

–జెడ్పీ సీఈఓ ఆదేశం


వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కాలిపోయిన టీవీని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు

ఐరాల: షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలిపోయిన కంప్యూటర్లు, ప్రింటర్లకు త్వరితగతిన మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలని జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలను సీఈఓతో పాటు , డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి రవికుమార్ పరిశీలించారు. వారు మాట్లాడుతూ, మరమ్మతులకు అవసరమైన నిధులను మంజూరు చేస్తామన్నారు. తొండ కారణంగా షార్ట్ సర్క్యూట్ సంభవించి ప్రభుత్వ కార్యాలయాల్లో రూ.15 లక్షల ఆస్తినష్టం సంభవించిన విషయం తెలిసిందే.

ఉద్యోగులు సమయ పాలన పాటించాలి


రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ధనలక్ష్మి

ఐరాల: గ్రామ సచివాలయాల ఉద్యోగులు సమయ పాలన పాటించడంతోపాటు చిత్తశుద్ధితో పనిచేయాలని.ఎంపీడీఓ ధనలక్ష్మి ఆదేశించారు. బుధవారం మండలంలోని గుండ్లపల్లె, పొలకల సచివాలయాలను ఆమె తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, పలు రికార్డులను పరిశీలించారు. ప్రజా సేవలపై ఆరా తీశారు. బయోమెట్రిక్ హాజరును తప్పక వేయాలన్నారు. అనంతరం పేరయ్యగారిపల్లె, గుండ్లపల్లె పంచాయతీల్లో చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. గ్రామాల్లో ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించి, చెత్త సంపద కేంద్రాలకు తరలించి, వర్మీ కంపోస్టు తయారు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో గుండ్లపల్లె ఎంపీటీసీ లోకేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

గర్భిణులపై ప్రత్యేక దృష్టి


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ రష్మిత

గుడిపాల: గర్భిణులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి రష్మిత అన్నారు. బుధవారం మరకాలకుప్పంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. రోగులను పరీక్షించి, మందులు అందజేసి ఆమె మాట్లాడారు. గర్భిణులకు ప్రతి వారం చికిత్స చేస్తున్నామని, రక్తపరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. వైద్యసిబ్బంది యమున, శశి, భానుప్రకాష్, దేవప్రీత, రాధ పాల్గొన్నారు.

జేఈఈ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న పీఎస్ఎన్ శ్రీ వివేకానంద కళాశాల కరస్పాండెంట్ సత్యనారాయణ


గగనసాయి


ప్రేమ్‌తేజ

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని పలు జూనియర్ కళాశాలల విద్యార్థులు జేఈఈ మెయిన్స్ (సెషన్–1) ఫలితాల్లో ప్రతిభ చాటారు. ఆ విద్యార్థులను కళాశాలల యాజమాన్యాలు అభినందించాయి. భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో స్థిరపడేలా ప్రణాళికతో విద్యనభ్యసిస్తామని ఫలితాలు సాధించిన విద్యార్థులు ప్రకటించారు.

పీఎస్ఎన్ శ్రీవివేకానంద కళాశాల విద్యార్థుల ప్రతిభ

మురుగానపల్లెలోని పీఎస్ఎన్ శ్రీవివేకానంద కళాశాల విద్యార్థులు యోహిత్ సాయి 96.03, అనీష్ 95.8, స్నేహ 95.7, పవన్‌కళ్యాన్ 94.2, సాహితి 93.1, గణేష్ 92.7, తేజారెడ్డి 92.5, దిలీప్ కుమార్ 92.1 పర్సంటైల్ సాధించినట్లు కరస్పాండెంట్ సత్యనారాయణ వెల్లడించారు. ఆ విద్యార్థులను ప్రిన్సిపల్ నాగరాజశెట్టి, అధ్యాపకులు అభినందించారు.

విజయం కళాశాలలో..

కొత్తబస్టాండ్ వద్ద ఉన్న విజయం జూనియర్ కళాశాల విద్యార్థులు గగనసాయి 92, పవన్‌సాయి 85 పర్సంటైల్ సాధించారని, అలాగే మరో 10 మంది విద్యార్థులు 80 కి పైగా పర్సంటైల్ సాధించినట్లు ఆ కళాశాల చైర్మన్ తేజోమూర్తి వెల్లడించారు.

వీఎంకే వివేకానంద కళాశాలలో..

మురుగానపల్లెలోని వీఎంకే వివేకానంద కళాశాల విద్యార్థులు తరుణ్‌కుమార్ 96.1, బాలు 95.9, లక్ష్య 95.8, హేమేశ్వర్ 95.7, సంతోష్ 95.4, రాకేష్ 92.1, సందీప్ 91.4 పర్సంటైల్ సాధించారని ఆ కళాశాల నిర్వాహకులు వి.మహేంద్ర, భాస్కర్ నాయుడు తెలిపారు. వారిని అధ్యాపకులు అభినందించారు.

జేఈఈ మెయిన్స్‌లో సత్తా చాటాడు

బంగారుపాళెం: మండలంలోని కచటివారిపల్లెకు చెందిన విద్యార్థి జేఈఈ మెయిన్స్‌లో సత్తాచాటాడు. గ్రామానికి చెందిన శాంతి, మార్కొండయ్య దంపతుల కుమారుడు ప్రేమ్‌తేజ విజయవాడలోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. మంగళవారం వెలువడిన జేఈఈ ఫలితాల్లో ప్రేమ్‌తేజ 93.48 శాతం మార్కులు సాధించడంతో పలువురు అభినందించారు.

వేదగిరివారిపల్లెలో ‘ఫ్యామిలీ డాక్టర్’


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్

ఐరాల: మండలంలోని వేదగిరివారిపల్లెలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ 104 వాహనంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు కూడా వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జాబ్ మేళా సద్వినియోగం చేసుకోండి

గంగాధరనెల్లూరు: జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని వెలుగు ఏపీఎం ఫరీద్ మస్తాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్, రాష్ట్ర సొసైటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ సహకారంతో ఈ నెల 14వ తేదీన చిత్తూరు ఎంప్లాయ్‌మెంట్ ఆఫీస్ వద్ద ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఏపీఎం ఫరీద్ మస్తాన్, నిర్వాహకులు రూపేష్, లోకేష్, కృష్ణయ్య తెలిపారు. హాజరయ్యే అభ్యర్థులకు వయస్సు 18 నుంచి 35 సంవత్సరాల్లోపు ఉండాలన్నారు. మిగిలిన వివరాలకు వెలుగు కార్యాలయంలో సంప్రదించాలని వారు కోరారు.

చెత్త నుంచి ఎరువుతో ఆదాయం


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రమణారెడ్డి

పలమనేరు: పట్టణంలోని మహిళా గ్రూపు సభ్యులకు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మెప్మా ఆధ్వర్యంలో బుధవారం తడి చెత్త, పొడిచెత్తపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి మాట్లాడుతూ, చెత్తను వేరు చేసి డంపింగ్‌కు పంపడం వలన రీసైక్లింగ్ సులభతరమవుతుందన్నారు. దీంతో పట్టణంలో కాలుష్యం తగ్గుతుందన్నారు. డంపింగ్ యార్డులో తయారుచేసే సేంద్రియ ఎరువుతో మున్సిపాలిటీ ఆదాయాన్ని పెంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మెప్మా సీఎంఎం బాబా, శానిటేషన్ విభాగ సిబ్బంది, గ్రూపు లీడర్లు, ఆర్‌పీలు పాల్గొన్నారు.

కౌన్సిలర్లతో జెడ్పీ చైర్మన్ భేటీ


కౌన్సిలర్లతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పలమనేరు: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మున్సిపల్ కౌన్సిలర్లతో బుధవారం భేటీ అయ్యారు. మున్సిపాలిటీకి సంబంధించిన పలు విషయాలపై ఆయన వారిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి, టౌన్ కన్వీనర్ జాఫర్, కౌన్సిలర్లు మండీసుధా, రహీంఖాన్, శ్యామ్, నయాజ్ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల మరమ్మతులకు రూ.1.56 కోట్లు

గంగాధరనెల్లూరు: ప్రభుత్వ హాస్టల్ భవనాలను రిపేర్లు చేయించి విద్యార్థులకు సౌకర్యం కల్పించడానికి రూ.1.56 కోట్లు నిధులు మంజూరయ్యాయని ఏఎస్‌డబ్ల్యూఓ షకీలా తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకొని హాస్టల్ భవనాలను రిపేర్ చేయడానికి నిధుల కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపించారని, దీంతో రాష్ట్ర ప్రభుత్వం రూ.1.56 కోట్లు నిధులు విడుదల చేసిందన్నారు. గంగాధరనెల్లూరు మండల కేంద్రంలోని బాలుర హాస్టల్ భవనానికి రూ.22 లక్షలు, బాలికల హాస్టల్ భవనానికి రూ.21 లక్షలు, తూగుండ్రం హాస్టల్ భవనానికి రూ.20.50 లక్షలు, ఎస్ఆర్ పురం మండలం కొత్తపల్లి మిట్ట హాస్టల్ భవనానికి రూ.33 లక్షలు, పెనుమూరు హాస్టల్ భవనానికి రూ.10 లక్షలు, ఉగ్రాణంపల్లె హాస్టల్ భవనానికి రూ.17.50 లక్షలు, పూతలపట్టు హాస్టల్ భవనానికి రూ.16 లక్షలు, పి.కొత్తకోట హాస్టల్ భవనానికి రూ.16 లక్షలు నిధులు మంజూరయ్యాయని తెలిపారు.

సరిహద్దుల్లో నిఘా పెంచండి


మాట్లాడుతున్న డీఎస్పీ సయ్యద్ అహ్మద్ అజీజ్

కార్వేటినగరం: సరిహద్దు ప్రాంతాల్లో నిఘా పెంచి ఎప్పటికప్పుడు అక్రమ వ్యాపారాలకు అడ్డుకట్ట వేయాలని నగరి డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ అన్నారు. బుధవారం స్థానిక సీఐ కార్యాలయంలో మీడియాతో డీఎస్పీ మాట్లాడారు. సర్కిల్ పరిధిలోని శ్రీరంగరరాజపురం, పాలసముద్రం, కార్వేటినగరం మండలాల సరిహద్దు ప్రాంతాల్లో గంజాయి, సారా, తమిళనాడు మద్యం అమ్మకాలు లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. కార్వేటినగరం ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల ఉన్నత పాఠశాల ప్రాంతాల్లో ఆకతాయిలు విద్యార్థులను ఇబ్బందులు పెడుతున్నట్లు సమాచారం ఉందని, అలాంటి ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. అక్రమ ఇసుకపై ప్రత్యేక దృష్టి సారించి దంపులను స్వాధీనం చేసుకోవాలన్నారు. డీఎస్పీ వెంట సీఐ హనుమంతప్ప, ఎస్‌ఐ రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

కుష్టు వ్యాధి నివారణకు కృషి

శ్రీరంగరాజపురం: కుష్టు వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్టు వ్యాధి నివారణ కోసం రోగులతో సమావేశం ఏర్పాటు చేశారు.

ఆయన మాట్లాడుతూ కుష్టువ్యాధి ప్రాణాంతకం కాదన్నారు. వ్యాధి బారిన పడిన వారు చికిత్స చేయకుండా వదిలేస్తే నరాలు దెబ్బతినడం, వికలాంగులు, పక్షవాతం, అంధత్వం వస్తుందన్నారు. అనంతరం రిటైర్డ్ డీపీఓ యువరాజు, శంకరమ్మ దంపతులు రోగులకు ఉచితంగా దుప్పట్లు, మందులు, చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారులు డాక్టర్ గిరి, బాలసుబ్రమణ్యంరెడ్డి, గౌరి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.